# సమ్మె విరమించాలంటూ ఒత్తిళ్లు

- మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులపై అధికారుల ఆగ్రహం
- తాత్కాలిక సిబ్బందిని నియమిస్తామంటూ వాట్సాప్‌లో నోటీసులు



వాట్సాప్‌లో హల్‌చల్ చేస్తున్న తేదీ లేని నోటీసులు

కర్నూలు (టౌన్): 'మూడు రోజుల క్రితం నగర పాలక ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే ఓ అధికారి కార్మికులను తన చాంబర్‌కు పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేశారు. సమ్మె విరమించుకోవాలని లేకుంటే టెంట్ పీకేస్తామంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. మరోవైపు ఇంకో అధికారి అనధికారిక నోటీసుల్లో విధులకు గైర్హాజరు అయితే తాత్కలిక సిబ్బందిని నియమించుకొని వారిని అప్కాస్‌లో చేరుస్తామంటూ భయపెడుతున్నారు. వాస్తవానికి ప్రత్యామ్నాయ సిబ్బందిని నియమించుకొని ఏర్పాట్లు చేయాల్సిన ఇంజినీరింగ్ అధికారులు కార్మికులను బెదిరించడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.'

ఒకటి కాదు. రెండు కాదు. 51 రోజులుగా మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ ఆందోళనలు చేస్తున్నారు. నిరసనలు తెలుపుతున్నారు. టెంటు వేసుకొని ధర్నాలు చేశారు. దీనిపై రాష్ట్ర నాయకత్వం మున్సిపల్ మంత్రి నారాయణతో మాట్లాడారు. చేస్తాం.. చూస్తాం.. అంటూ కాలయాపన చేస్తున్నారు తప్పా.. సమస్యను పరిష్కరించడం లేదు. విధిలేని పరిస్థితుల్లో కార్మికులు విధులను బహిష్కరించి రోడ్డెక్కారు. కర్నూలు నగరంలో ర్యాలీలు చేశారు. కలెక్టరేట్ వద్ద పిల్లపాపలతో నిరసనలు వ్యక్తం చేశారు. అయినా ప్రభుత్వం మాత్రం నిమ్మకు నీరెక్కినట్లు వ్యవహరిస్తున్నందున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తమకు వేతనాలు రూ.13 వేల స్థానంలో రూ.29 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను తమ కుటుంబాలకు వర్తింపజేయాలని కోరుతున్నారు. అయినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. నగర పాలకలో వాటర్ వర్క్స్, వీధిలైట్లు, పార్కుల నిర్వహణ, కంప్యూటర్ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఇలా 363 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వారంతా ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు.

### తీవ్రమైన తాగునీటి సరఫరా, వీధి లైట్ల సమస్య

కార్మికుల సమ్మె 51 రోజులకు చేరినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. ఇప్పటికే కర్నూలు నగరంలోని పలు వార్డుల్లో తాగునీటి సమస్య తీవ్రమైంది. నీటి సరఫరాలో వాటర్ వర్క్స్ ఇంజినీర్లు చేతులెత్తేశారు. పలు కాలనీలలో ఇబ్బందులు పెరుగుతున్నాయి. మంత్రి టీజీ భరత్ ఉంటున్న కొత్తపేటలో మంచినీటి సరఫరా లేక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి ప్రాతినిధ్యం వహించే కల్లూరు కాలనీలలో తాగునీటి ఇక్కట్లు తీవ్రమయ్యాయి. కాలనీలలో వీధి లైట్లు వెలగడం లేదు. ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకునే నాథుడు లేడు. మంత్రి ఏరియాలో మాత్రం తాగునీరు, వీధి లైట్ల సమస్య రాకుండా అధికారులు చూస్తున్నారు.

### కార్మికులపై తీవ్ర ఒత్తిళ్లు

ఇప్పటికే ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే కార్మికులకు ఒత్తిళ్లు ప్రారంభమయ్యాయి. విధుల్లో చేరాలని, లేకుంటే తొలగిస్తామన్న సంకేతాలు కార్పొరేషన్ వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేస్తున్నాయి. సమ్మెలో ఉన్న కార్మికుల స్థానంలో తాత్కాలిక సిబ్బందిని నియమించి అప్కాస్‌లో చేరుస్తామని అధికారులు అనధికారికంగా వాట్సాప్‌లో హెచ్చరికలు చేస్తున్నారు. అయితే తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగిస్తామని కార్మికులు స్పష్టం చేస్తున్నారు.

## క్లుప్తంగా

### గౌరీశంకరునికి అన్నాభిషేకం



శివలింగానికి అన్నాభిషేకం చేస్తున్న అర్చకుడు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం ఆషాఢ మాసం ప్రారంభం, ఆరుద్రా నక్షత్రం సందర్భంగా గౌరీ శంకరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రాతఃకాల పంచామృతాభిషేకం, అన్నాభిషేకం చేశారు. గౌరీ శంకరుడిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### నేడు సీ.క్యాంపు రైతుబజారు బంద్

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలులోని సి.క్యాంపు రైతుబజారును శుక్రవారం ఒక్కరోజు బంద్ చేస్తున్నట్లు ఎస్టేటు ఆఫీసర్ కళ్యాణి, హార్టికల్చర్ కన్సల్టెంటు శివకుమార్ తెలిపారు. రైతుబజారులో శుభ్రతకు పెద్దపీట వేస్తున్నామని, క్లీనింగ్ నిమిత్తం ఒక్కరోజు సెలవు ప్రకటించినట్లు వారు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు, రైతులు, పొదుపు మహిళలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. శనివారం నుంచి రైతుబజారు యథావిధిగా పనిచేస్తుందని పేర్కొన్నారు.

### మాజీ సైనికుడి మృతి



వెంకటరమణ (ఫైల్)

కర్నూలు(అర్బన్): నగరంలోని గుత్తి పెట్రోల్ బంక్ సమీపంలోని కాలనీలో నివాసం ఉంటున్న మాజీ సైనికుడు వెంకటరమణ అనారోగ్యంతో గురువారం మృతి చెందినట్లు జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు నర్రా పేరయ్య తెలిపారు. మృతుడు వెంకటరమణ 17 సంవత్సరాలు ఆర్మీలో హవల్దార్‌గా విధులు నిర్వహించి రిటైర్డు అయ్యారన్నారు. ఆయన అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. మృతి చెందిన మాజీ సైనికుడి కుటుంబానికి తమ సంఘం ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు. పలువురు మాజీ సైనికులు కూడా వెంకటరమణ మృతికి తమ సంతాపం వ్యక్తం చేశారు.


### రైతుబజారులో రైతులకే స్థానం



భూపాల్‌నగర్‌లో ఉద్యాన పంటలను పరిశీలిస్తున్న రైతుబజార్ల హార్టికల్చర్ కన్సల్టెంటు శివకుమార్

కర్నూలు(అగ్రికల్చర్): ఉద్యాన రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి రైతుబజారులో ఉత్పత్తులను అమ్ముకునేందుకు అవకాశం కల్పిస్తామని రైతుబజార్ల హార్టికల్చర్ కన్సల్టెంటు శివకుమార్ తెలిపారు. గురువారం కర్నూలు రూరల్ మండలంలోని భూపాల్‌నగర్, మిలిట రీ కాలనీ, నందనపల్లి, పడిదెంపాడు, నందనపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు సాగుచేసిన ఉద్యాన పంటలను ఆయన పరిశీలించారు. రైతుబజారులో కూరగాయలు అమ్ముకునేందుకు అవకాశం ఇవ్వాలని కొందరు రైతులు దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో రైతులు సాగు చేసిన కూరగాయల పంటలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నిజమైన రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తామన్నారు. కొత్తగా ఉద్యాన పంటలు సాగు చేసిన రైతులు రైతుబజారులో కూరగాయలను అమ్ముకునేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

### పెద్దాసుపత్రికి ఏసీల వితరణ



ఏసీలను అందజేస్తున్న మెడికవర్ యాజమాన్యం

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని మెడికవర్ హాస్పిటల్ వారు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు మూడు ఏసీలను వితరణ చేశారు. గురువారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు చేతుల మీదుగా వీటిని అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రభుత్వంతో పాటు ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు సైతం చేయూతనిచ్చి ఆసుపత్రి అభివృద్ధికి పాటుపడాలని కోరారు. అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాలనాగాంజన్, మెడికవర్ హాస్పిటల్ క్లస్టర్ హెడ్ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ప్రింటర్ విరాళం

ఓర్వకల్లు: మండలంలోని ఉప్పలపాడు జెడ్పీ హై స్కూల్‌కు గ్రామానికి చెందిన దూదేకుల దస్తగిరి మహబూబ్ ఉస్సేన్ (సాఫ్ట్‌వేర్ ఇంజినీర్) ఎల్రక్టానిక్ ప్రింటర్‌ను విరాళంగా అందజేశారు. వివాహ మహోత్సవం సందర్భంగా తాను చదువుకున్న పాఠశాలకు ప్రింటర్‌ను విరాళంగా ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

## ప్రారంభమైన వారాహి నవరాత్రులు



లలితా పీఠంలో పూజల్లో పాల్గొన్న మహిళలు

కర్నూలు కల్చరల్: ఆషాఢ మాసం మొదటి రోజు పురస్కరించుకొని గురువారం వారాహి నవరాత్రులు ప్రారంభమయ్యాయి. ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో లోక కల్యాణార్థం వారాహి అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, ఆషాఢ మాస పూజలు నిర్వహించారు. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి సందేశమిచ్చారు. లలితా సంఘం అధ్యక్షుడు తెల్లాకుల జ్ఞానేశ్వరమ్మ, పీఠం సభ్యులు పాల్గొన్నారు. అలాగే కర్నూలు నగర శివారులోని సూర్యనారాయణ స్వామి దేవాలయంలో మహా గౌరీ అమ్మవారికి వారాహి నవరాత్రి (గుప్త నవరాత్రులు) పూజలు చేశారు. లలితా సహస్ర నామార్చన, వారాహి సహస్ర నామార్చన, హోమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

## సాహు మహరాజ్ ఆశయ సాధనకు కృషి



మాట్లాడుతున్న పట్నం రాజేశ్వరి

కర్నూలు(అర్బన్): దళిత, బహుజనులకు ప్రజాస్వామిక తాత్విక పునాదిపై సామాజిక న్యాయం ఏర్పరచి ప్రజల హృదయాల్లో రాజుగా నిలిచిపోయిన సాహు మహరాజ్ ఆలోచనా విధానంతో ముందుకు వెళ్లాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి, రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి సూచించారు. గురువారం స్థానిక ఐక్యవేదిక కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు పాలెం రాధ ఆధ్వర్యంలో సాహు మహరాజ్ 151వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా సాహు మహరాజ్ చిత్రపటానికి మహిళా నేతలు పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ మహిళా ఐక్యవేదిక నేతలు నిజాయితీ, నిబద్ధతతో వేదిక విధివిధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు, దాడులకు వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. మహిళా నేతలు కటికె భాను, సుంకమ్మ, ఆకుతోట పద్మావతి, ఈరమ్మ, దస్తగిరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## హజ్ యాత్రికులకు అన్ని సౌకర్యాలు



మాట్లాడుతున్న మన్సూర్

కర్నూలు(అర్బన్): సౌత్ ఇండియా హజ్, ఉమ్రా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్రా, హజ్‌కు వెళ్లే భక్తులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్లు హజ్ కమిటీ డైరెక్టర్ మన్సూర్ చెప్పారు. గురువారం స్థానిక ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈ అసోసియేషన్‌ను కర్ణాటక రాష్ట్రంలో ప్రారంభించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో విస్తరించామన్నారు. ఈ అసోసియేషన్ ద్వారా భక్తులకు నాణ్యమైన సేవలు అందుతాయన్నారు. కొందరు ఏజెంట్ల రూపంలో హజ్ యాత్రకు వెళ్లే భక్తులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అలాంటి ఇబ్బందులను నివారించేందుకు అసోసియేషన్ ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జాఫర్ మోహిద్దీన్, షా ఫైషల్, మహమ్మద్ ఫయాజ్, సుల్తాన్, షేక్ ఫయాజ్, అబ్దుల్ జలీల్‌తో పాటు సౌత్ ఇండియా నుంచి హజ్ టూర్ ఆపరేటర్స్ పాల్గొన్నారు.

## సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): జూలై 9వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ ఓల్డ్‌సిటీ ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు పిలుపునిచ్చారు. ఆ రోజు నగరంలో జరిగే ఆందోళనల్లో పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొనాలని కోరారు. గురువారం సుర్జీత్ భవన్‌లో సీఐటీయూ ఓల్డ్‌సిటీ కమిటీ ఆఫీసు బేరర్ల సమావేశాన్ని అధ్యక్షుడు అబ్దుల్‌దేశాయ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్రాల్లోని కూటమి ప్రభుత్వాలు కార్మికులపై నిరంకుశ వైఖరిని అవలంభిస్తున్నాయని విమర్శించారు. 1986లో అమెరికాలోని చికాగో సమావేశంలో సాధించుకున్న 8 గంటల పని విధానానికి స్వస్తి చెప్పడం అన్యాయమన్నారు. పది గంటల పని విధానంతో మహిళలు రాత్రిళ్లు కూడా ఉద్యోగాలు చేయాలా? అని ప్రశ్నించారు. కార్మికులు ప్రాణత్యాగం చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేయడం అన్యాయమని, వాటి స్థానంలో ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు చాంద్‌బాషా, సూరి, మహబూబ్‌బాషా, నాసిర్, సాధిక్ పాల్గొన్నారు.

## ఫాసిస్టు విధానాలపై పోరాటం



మాట్లాడుతున్న వి.మల్లికార్జున

కర్నూలు(సెంట్రల్): 1975లో విధించిన ఎమర్జెన్సీ కంటే ప్రస్తుత ప్రధాని నరేంద్రమోదీ ఫాసిస్టు విధానాలు ఘోరంగా ఉన్నాయని, వాటికి వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధమవుదామని సీపీఐ ఎంఎల్‌న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి వి.మల్లికార్జున పిలుపునిచ్చారు. గురువారం ఎమర్జెన్సీకి 50ఏళ్లు నిండిన నేపథ్యంలో అంబేడ్కర్ భవన్‌లో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆనాడు దేశంలో ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని విధించి ప్రజాస్వామ్యాన్ని మంటగలిపిందన్నారు. ప్రస్తుతం మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ సర్కార్ అణచివేత దోరణులు దారుణంగా ఉన్నాయని, ఎమర్జెన్సీ కంటే ఘోరంగా మాట్లాడితే జైళ్లలో వేస్తున్నారని చెప్పారు. పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కె.భాస్కర్ మాట్లాడుతూ..అణచివేతదారులకు ఘోరమైన పరాభావం తప్పదన్నారు. పీడీఎస్‌యూ మాజీ నాయకులు శేషఫణి, రాజు, వెంకప్ప, వెంకటస్వామి పాల్గొన్నారు.

## విద్యతోనే పేదరిక నిర్మూలన



చిన్నారులకు పుస్తకాలు అందిస్తున్న టీఎస్ఎఫ్ నేతలు

కర్నూలు(అర్బన్): విద్యతోనే పేదరికాన్ని నిర్మూలించవచ్చని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.చంద్రప్ప అన్నారు. గురువారం నగర శివారులోని నిరుపేద గిరిజన విద్యార్థులకు నోటు పుస్తకాలు, ప్యాడ్స్, పెన్నులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలక ప్రభుత్వాలు పేద, మధ్య తరగతి వర్గాలకు వివిధ రూపాల్లో విద్యను అందించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నా, పేదరికం కారణంగా కనీసం పుస్తకాలు కొనలేని అనేక కుటుంబాలు సమాజంలో ఉన్నాయన్నారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పుస్తకాలను అందించకపోవడం వల్ల పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ శాఖలకు చెందిన అధికారులు తమ వంతు కృషిగా గ్రామీణ ప్రాంతాల్లో సర్వే నిర్వహించి అర్హులైన పేద విద్యార్థులకు పుస్తకాలను అందించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో టీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామరాజు, వెంకటేష్, ఎరుకల సంఘం నాయకులు కరివేపాకు రామక్రిష్ణ, మోటా రామాంజనేయులు పాల్గొన్నారు.

### క్రీడా సామగ్రి పంపిణీ

కర్నూలు (టౌన్): స్థానిక గాయత్రీ ఎస్టేట్‌లో గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ గురువారం తన నివాసంలో తైక్వాండో క్రీడాకారులకు క్రీడా పరికరాలు, స్పోర్ట్స్ డ్రస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలకు తన వంతు సహకారం అందిస్తామన్నారు. క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. అలాగే మార్షల్ ఆర్ట్స్, తైక్వాండో వంటి కఠినమైన క్రీడల్లో బాలికలు రాణించడం శుభపరిణామమన్నారు. తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి టీ.వెంకటేశ్వర్లు, కోచ్ నాగరాజు, వెంకటేష్, అజయ్, తేజ పాల్గొన్నారు.

### నేడు నేర సమీక్ష సమావేశం

కర్నూలు: జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో శుక్రవారం నేర సమీక్ష సమావేశం (క్రైం మీటింగ్) జరగనుంది. ఈ మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలకు డీపీఓ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. గత నెలలో నమోదైన కేసులతో పాటు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులు, రోడ్డు ప్రమాదాలు, డ్రంకెన్ డ్రైవ్, సైబర్ నేరాలు, విచారణ దశలో ఉన్న కేసులు, హత్యలు, అత్యాచారాలు, ఇంటి దొంగతనాలు, చైన్ స్నాచింగ్స్, మహిళా నేరాలు తదితర కేసులపై ఎస్పీ సమీక్షించి కేసుల పరిష్కారానికి దిశా నిర్దేశం చేయనున్నారు. జిల్లాలో 4 పోలీస్ సబ్‌డివిజన్లు, 9 పోలీస్ సర్కిళ్లు, 15 అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్లు, 38 పోలీస్ స్టేషన్లు, 4 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. వాటి పరిధిలో నమోదైన అన్ని రకాల కేసులను ఎస్పీ సమీక్షించనున్నారు. డీసీఆర్‌బీ, డీఎస్‌బీ, డీటీఆర్‌బీ, ఎస్సీ, ఎస్టీ సెల్, ఫ్యాక్షన్ జోన్, మహిళా పీఎస్, కర్నూలు పోలీసు శిక్షణ కళాశాల (డీటీసీ) అధికారులు సమావేశంలో పాల్గొననున్నారు.

### ప్రయాణికుల సౌకర్యార్థం కుర్చీల ఏర్పాటు



కుర్చీలను ప్రారంభిస్తున్న ప్రయాణికుడు

కర్నూలు సిటీ: కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు కూర్చునేందుకు ఆర్టీసీ కేంద్ర కార్యాలయం నుంచి కొత్త కుర్చీలు మంజూరు చేశారు. గురువారం బస్టాండ్‌లో కొత్తగా మంజూరైన కుర్చీలను ప్రయాణికుల చేతుల మీదుగా వాడుకలోకి తీసుకొచ్చారు. మొత్తం 25 సెట్‌లను ఏర్పాటు చేశారు. ఒక్కో సెట్‌లో ముగ్గురు కూర్చునేందుకు అవకాశం ఉంటుంది. ఈ కార్యక్రమంలో కర్నూలు డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ సుధారాణి, కర్నూలు-2 డిపో మేనేజర్ కె.ఎల్.ఎస్ శర్మ, కర్నూలు-1 డిపో అసిస్టెంట్ మేనేజర్ సుబ్రమణ్యం, కర్నూలు బస్‌స్టేషన్ మేనేజర్ కాంచన, తదితరులు పాల్గొన్నారు.

### స్వామి సహజానంద సరస్వతికి నివాళి



స్వామి సహజానంద సరస్వతికి నివాళులర్పిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఏబికేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు స్వామి సహజానంద సరస్వతీ 75వ వర్ధంతి పురస్కరించుకొని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం నివాళులర్పించారు. సీఆర్ భవన్‌లో ఆయన చిత్ర పటాన్ని ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దంబోళం శ్రీనివాసరావు, రఫియ, మల్లికార్జున పాల్గొన్నారు.

### పేదలకు కంటి అద్దాల పంపిణీ



పేదలకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ శంకరశర్మ

కర్నూలు(హాస్పిటల్): సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకరశర్మ గురువారం పేదలకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మనిషి జీవితంలో కంటి చూపు ప్రాధాన్యతను వివరించారు. సమాజంలో ఎంతో మంది చూపులేక బాధపడుతున్నారని, అలాంటి వారికి రానున్న రోజుల్లో కంటిచూపు లభించే అవకాశాలు రావాలని ఆకాంక్షించారు. ప్రతిఒక్కరూ తమ సంపదలో ఎంతో కొంత భాగాన్ని సామాజిక సేవ కార్యక్రమాలకు వినియోగించాలని సూచించారు.

## యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



డ్రగ్స్ నిర్మూలన ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్‌యూ వీసీ వెంకట బసవరావు

కర్నూలు సిటీ: యువత మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాకు దూరంగా ఉండాలని క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం వర్సిటీలో అంతర్జాతీయ మాదక ద్రవ్య దుర్వినియోగం.. అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశ భవిష్యత్తు అయిన యువత డ్రగ్స్, మత్తుకు అలవాటుపడి విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. మాదక ద్రవ్యాలను తీసుకుంటుండడంతో యువత శరీరం నీరసించి పోయి చివరికి ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారన్నారు. డ్రగ్స్ తీసుకుంటే జరిగే పరిణామాల గురించి యువతకు, పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడైనా, ఎవరైనా డ్రగ్స్ వాడుతుంటే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1972కు ఫోన్ చేయాలన్నారు. ఆ తరువాత సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాస్ మాట్లాడారు. విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బందితో డ్రగ్స్ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. వర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ డీన్ డాక్టర్ హెచ్ అక్తర్ భాను, సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ప్రసాద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## టీబీ పరీక్షలు చేయించుకోండి



టీబీపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నిస్సిగ్రేస్

కల్లూరు: టీబీ పరీక్షలు చేయించుకోవాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నిస్సి గ్రేస్ సూచించారు. ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని కొల్లంపల్లి తండాలో గురువారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ ఇంటెన్సిఫైడ్ క్యాంపెయిన్ నిర్వహించి, టీబీ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ 60 ఏళ్ల పైబడిన వారు, బిఎంఐ18.5బిలో ఉన్న వారు, మధుమేహం, పొగ, మద్యం తాగేవారు, కర్మాగారాల్లో పని చేసే వారు గళ్ల పరీక్షలు, ఎక్స్ రేలు తీయించుకోవాలన్నారు. టీబీ నిర్ధారణ అయితే క్రమం తప్పకుండా మందులు వాడి నయం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ స్వర్ణగౌరి, టీబీ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మున్సిపల్ భవనాలపై నీరు నిలవకుండా చర్యలు

కర్నూలు (టౌన్): మున్సిపల్ భవనాలు, సచివాలయాల భవనాలు, కమ్యూనిటీ భవనాలపై వర్షపు నీరు నిలువ ఉండకుండా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ యస్.రవీంద్రబాబు అన్నారు.ఆయన గురువారం నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల సిబ్బందితో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నగర ప్రజలు సైతం తమ ఇళ్లు, భవనాల కప్పులపై శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పై కప్పుల్లో వర్షపు నీరు నిలవకుండా నజావుగా కిందికి సాగేందుకు ఎటువంటి ఆటంకాలు లేకుండా చేసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండటం వల్ల ఐరన్ పాడై, పెచ్చులు ఊడి స్లాబ్ దెబ్బతింటుందన్నారు. అలాగే ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, కుండలు, ప్లాస్టిక్ బాటిల్స్, మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. తద్వారా దోమలను నివారించవచ్చన్నారు.

### ఒకేషనల్ విద్యార్థులకు అంప్రెటిస్‌షిప్ కీలకం



మాట్లాడుతున్న ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి సి.సురేంద్రబాబు

కర్నూలు సిటీ: ప్రభుత్వ, ప్రైవేటు ఒకేషనల్ జూనియర్ కాలేజీల్లో వివిధ ఒకేషనల్ కోర్సులు చదివిన విద్యార్థులకు అంప్రెటిస్‌షిప్ కీలకమని, ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లు ఒకేషనల్ కోర్సులు చదివిన విద్యార్థుల వివరాలను సేకరించాలని ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి సి.సురేష్ బాబు సూచించారు. గురువారం టౌన్ మోడల్ జూనియర్ కాలేజీలో ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్లతో ఒకేషనల్ ట్రైనింగ్ ప్రోగ్రాంకు విద్యార్థులను గుర్తించే అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఒకేషనల్ కోర్సులు చదివిన విద్యార్థులు తప్పనిసరిగా అంప్రెటిస్‌షిప్‌కు హాజరైతే వారిలోని నైపుణ్యాలను మరింత పెంచుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. నైపుణ్యాల పెంపుతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. ఇంటర్ వొకేషనల్ పూర్తయిన విద్యార్థులతో పాటు, సెకండియర్ విద్యార్థులకు సైతం అప్రెంటిస్‌షిప్ నిర్వహించనున్నామని, తద్వారా విద్యార్థులు మంచి ఉద్యోగాలు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. అప్రెంటిస్‌షిప్ పూర్తయిన తరువాత బహుళజాతి కంపెనీలతో జాబ్ మేళాను ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు చెప్పారు. ప్రిన్సిపాళ్లు లాలెప్ప, నాగస్వామి నాయక్, పద్మావతి, ఏజీఎంఓ సుంకన్న, తదితరులు పాల్గొన్నారు.

### మత్తుతో జీవితాలు చిత్తు

కల్లూరు: మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తవుతాయని సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు అన్నారు. గురువారం ఉలిందకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరదాగా మొదలయ్యే మాదక ద్రవ్యాల వినియోగం క్రమంగా వ్యసనంగా మారి బానిసలు అవుతున్నారన్నారు. మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల మానసిక, ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. కార్యక్రమంలో వైద్యులు నవీన్, ప్రధానోపాధ్యాయులు లీలావతి, ఆరోగ్య విస్తరణ అధికారి విజయ్‌కుమార్, క్షేత్రస్థాయి పర్యవేక్షకులు మద్దమ్మ, ఆరోగ్య కార్యకర్త పద్మావతి, ప్రాజెక్టనిస్ట్ ఖలీల్ పాల్గొన్నారు.